అసమర్థులకు ఓటేస్తే వృథానే



కేతవీరునిపాడు, గుత్తావారిపాలెం ఎత్తిపోతల పథకం

- ఎంపీ కేశినేని నాని
- రూ.34.50కోట్లతో ఎత్తిపోతల పథకం ప్రారంభం..
- నందిగామలో ఎమ్మెల్యే జగన్‌మోహన రావు మార్కు అభివృద్ధి
- ఎమ్మెల్యే పనితీరుపై ప్రశంసలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, వేదికపై ఎంపీ కేశినేని నాని, కొండారెడ్డి తదితరులు

నందిగామ టౌన్: అసమర్థులకు వేసే ఓటు వృధా అవుతుందని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) అన్నారు. ఎన్నికల సమయంలో పార్టీలు, కులమతాలు చూడకుండా కేవలం సమర్థతను చూసి మాత్రమే ఓటు వేయాలని ప్రజలను కోరారు. నందిగామ మండలం పెద్దవరం గ్రామ సమీపంలోని కృష్ణానది ఒడ్డున నాబార్డు నిధులు రూ.34.50 కోట్లతో నూతనంగా నిర్మించిన కేతవీరునిపాడు, గుత్తావారిపాలెం ఎత్తిపోతల పథకాన్ని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ కుమార్‌లతో కలిసి శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని మాట్లాడుతూ రాష్ట్ర రైతుల అభ్యున్నతి కోసం పోలవరం ప్రాజెక్టు సాధించేందుకు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఢిల్లీలో ఎంత కష్టపడ్డారో తాను ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. ఎన్నికల్లో సమర్థులకు ఓటువేస్తేనే ప్రజలకు మంచి జరుగుతుందని, ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా ఒకేపార్టీకి ఓటు వేసినా, ఈ ప్రాంతానికే చెందిన వ్యక్తులు రాష్ట్ర మంత్రులుగా పనిచేసినా ఈ ప్రాంత అభివృద్ధికి వారు ఏమిచేయలేదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు నిరుపేదలకు సైతం జాతీయ స్థాయి విద్యనందించాలనే కాంక్షతో కేంద్రీయ విద్యాలయాన్ని సాధించడంతోపాటు నందిగామను నవ నందిగామగా అభివృద్ధి చేసి చూపుతున్నారని కొనియాడారు. ఇద్దరు మంత్రులు ఉన్న ఓ సందులో చేతికందే ఎత్తులో ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్ కారణంగా పలువురు ప్రజలు మృత్యువాత పడినప్పటికీ ఆ విద్యుత్‌లైన్‌ను వారు మార్చలేకపోయారని, ఆపనిని ఎమ్మెల్యేగా జగన్‌మోహనరావు చేసి చూపించారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటినుంచి రైతు సంక్షేమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, ఎంపీపీ ఆకుల రంగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కందుల నాగేశ్వరరావు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, చల్లా బ్రహ్మేశ్వరరావు, నెలకుదిటి మహేష్, వైఎస్ఎన్ ప్రసాద్, చిరుమామిళ్ల చైతన్యకుమార్, నల్లాని అయ్యన్న, అరిగెల సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.93కోట్లతో బీటీ రోడ్డుకు శంకస్థాపన..

మండలంలోని పెద్దవరం గ్రామంలో డిస్ట్రిక్ మినరల్ ఫౌండేషన్ నిధులు రూ.1.93 కోట్లతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు శుక్రవారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో నడిపిస్తున్నట్లు తెలిపారు. కృష్ణా పుష్కరాల సమయంలో రోడ్లకు అతుకులువేసి కోట్లు కాజేశారని మండిపడ్డారు. వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, నాయకులు సింగంశెట్టి నాగేశ్వరరావు, కొండా కృష్ణారెడ్డి, కమతం వెంకట నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట చరిత్రలో అద్భుత ఘట్టం



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, పక్కన విప్ ఉదయభాను, ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్సీ అరుణకుమార్



జగ్గయ్యపేట అర్బన్ : రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతీయజెండాను శుక్రవారం జగ్గయ్యపేట చరిత్రలో ఓ అద్భుతఘట్టమని చెప్పవచ్చు. 150 అడుగుల ఈ జాతీయజెండాను రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ ఆవిష్కరించారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ జెండా ప్రాజెక్టులో రూ 60లక్షల వ్యయంతో ఎకరన్నర స్థలం చుట్టూత ప్రహరీగోడ ఏర్పాటు చేస్తుండగా, కేసీపీ సిమెంట్స్ వారి సహకారంతో రూ 50 లక్షల వ్యయంతో జెండా స్తూపం చుట్టూతా తిరంగా పార్కు, వాటర్ ఫౌంటెయిన్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఉదయభాను తెలిపారు. సీఎస్ఆర్ ఫండ్స్ అందిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ఆయా కర్మాగారాల ప్రతినిధులను గవర్నర్ అబ్దుల్‌నజీర్ సత్కరించారు. గవర్నర్ అబ్దుల్‌నజీర్ సతీమణి సమీర నజీర్‌ను విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను ఘనంగా సత్కరించారు.ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, కలెక్టర్ ఢిల్లీరావు, ఆర్డీవో సాయిబాబు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా, కేసీపీ సిమెంట్స్ వైస్ ప్రెసిడెంట్ మధు, ఆల్ట్రాటెక్ సిమెంట్స్ నుంచి కె.శ్రీధర్, రామ్‌కో సిమెంట్స్ నుంచి ఆశిష్‌కుమార్ శ్రీవాత్సవ, కోహెన్స్ లైఫ్ సైన్సెస్ నుంచి సోమయ్య, వైఎస్సార్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకుడు వేల్పుల రవికుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, 31వ వార్డు కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రావు, యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. తొలుత గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ దంపతులకు పట్టణంలోని వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.



పింగళి వెంకయ్య మనుమడు నరసింహం దంపతులను సత్కరిస్తున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్

క్లుప్తంగా

ముగిసిన ముస్లింల రిలే నిరాహార దీక్షలు



జగ్గయ్యపేట అర్బన్: కోర్టులో కేసులు వేయించడం ద్వారా షాదీఖానా నిర్మాణాన్ని అడ్డుకున్న టీడీపీ నాయకుల చర్యలను నిరసిస్తూ ముస్లిం సోదరులు స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద వారంరోజులుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దంపతులు దీక్షల శిబిరాన్ని సందర్శించారు. ముస్లింలతో చర్చించి వారితో దీక్షలను విరమింపజేశారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పుట్టబజారులో రూ.7కోట్ల విలువైన స్థలంలో షాదీఖానా నిర్మాణం పూర్తయితే తనకు ఎక్కడ మంచిపేరు వస్తుందోనని టీడీపీ నాయకులు ఓర్వలేకనే కొందరు మహిళలచే కోర్టులో కేసులు వేయించి నిర్మాణ పనులు నిలుపుదల చేయించడం సబబుకాదన్నారు. ఈ చర్యల కారణంగా ముస్లింలకు తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. ప్రజలకు మేలు జరిగే పనులకు సహకరించాల్సి ఉండగా, అభివృద్ధిని అడ్డుకోవడం తగదని టీడీపీ నాయకులకు హితవు పలికారు. జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సామినేని విమలాభానుతోపాటు మాజీ కౌన్సిలర్ గెంటేల భాగ్యలక్ష్మి, రమణి, లతశ్రీ, పెద్దసంఖ్యలో ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

వీధిదీపాలు అందజేసిన రామ్‌కో



జయంతిపురం(జగ్గయ్యపేట): గ్రామాభివృద్ధికి రామ్‌కో యాజమాన్యం పూర్తి సహకారం అందిస్తోందని కర్మాగారం ప్రెసిడెంట్ ఆశీష్ కుమార్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. కర్మాగారం దత్తత గ్రామమైన మండలంలోని కె.అగ్రహారం గ్రామానికి రూ.1.26లక్షల విలువైన వీధి దీపాలను శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎస్సార్ ఫండ్స్ ద్వారా గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఆసంస్థ డిజియం రామకృష్ణసాయి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు కృష్ణారావు, అయ్యప్ప, శ్రీనివాస్, పిచ్చయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విప్ ఉదయభానును కలిసిన బద్దూనాయక్



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన జగ్గయ్యపేటకు చెందిన లాహోరి బద్దూనాయక్, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానును శుక్రవారం ఆయన నివాసంలో కలిశారు. తన నియామకానికి సహకరించారంటూ పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. విప్ ఉదయభాను మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

ఘనంగా సామూహిక సూర్యవ్రతం



మధురానగర్(విజయవాడసెంట్రల్): లోక కల్యాణార్థం శ్రీశివజ్ఞాన పీఠాధిపతి శ్రీ శివాచార్యస్వామి ఆధ్వర్యాన శుక్రవారం అజిత్‌సింగ్ నగర్ గుజ్జల సరళదేవి కల్యాణ మండపంలో సామూహిక శ్రీసూర్యవ్రతం జరిగింది. ఈ సందర్భంగా శ్రీశివజ్ఞాన పీఠాధిపతి శ్రీశివాచార్య స్వామి సూర్యగ్రహ హోమం, సూర్యవ్రతం శాస్త్రోక్తంగా చేయించారు. అలాగే శ్రీసూర్యవ్రతం, రథసప్తమి విశిష్టతను వివరించారు. ఈ నెల 26వ తేదీన మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయం సమీపంలోని బచ్చు కోటయ్య వసతి గృహంలో చంద్రగ్రహ వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. సూర్యభగవానుడి ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని సూర్యవ్రతంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు ఆకాంక్షించారు. లోక కల్యాణార్థం ఏర్పాటు చేసిన శ్రీసూర్యవ్రతంలో వారు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఛాంబర్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన రంగుల మండపం



తిరుమలగిరి నుంచి సారె తీసుకువస్తున్న ఆలయ చైర్మన్ భరద్వాజ్, పాలకవర్గసభ్యులు



రంగుల మండపంలో భక్తుల సందడి

జగ్గయ్యపేట: పట్టణంలోని కాగితాలబజారులో గల శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి రంగుల మండపం భక్తులతో శుక్రవారం కిటకిటలాడింది. రథసప్తమి కూడా కావడంతో అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులు ప్రత్యేక పొంగళ్లు చేసి అమ్మవారికి సమర్పించారు. ఈ నెల 18న తిరుపతమ్మ అమ్మవారుతోపాటు సహదేవతలు రంగులు పూర్తి చేసుకుని పెనుగంచిప్రోలుకు పయనం కానున్న నేపథ్యంలో జగ్గయ్యపేటతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

తిరుమలగిరి నుంచి సారె సమర్పణ.....

మండలంలోని తిరుమలగిరి గ్రామంలో వేంచేసి ఉన్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయం తరుపున శ్రీతిరుపతమ్మ అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్, పాలకవర్గ సభ్యులు ఊరేగింపుగా వచ్చి సారెను సమర్పించి పూజలు చేశారు.

పిట్టలదొరకు టికెట్ అమ్ముకున్న చంద్రబాబు



సభలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, వేదికపై ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తదితరులు



ముప్పాళ్లలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ రమాదేవి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమెల్సీ

ఎంపీ కేశినేని నాని

చందర్లపాడు(నందిగామ టౌన్): టీడీపీ అధినేత చంద్రబాబు పనికిమాలిన పిట్టలదొరకు తన సీటును అమ్ముకున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) విమర్శించారు. చందర్లపాడు మండలం ముప్పాళ్లలో రూ.87.20లక్షలతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయాలు, రూ.43.60లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.1.86కోట్లతో ఏర్పాటు చేసిన 33/11కెవీ విద్యుత్ సబ్‌స్టేషన్, రూ.20లక్షలతో నిర్మించిన శ్మశానవాటిక ప్రహరీని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్‌లతో కలిసి శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని మాట్లాడుతూ చంద్రబాబుకు తన సామాజికవర్గం తప్ప మిగిలిన సామాజికవర్గాల మద్దతు లేదని తెలిపారు. ఆత్మాభిమానం చంపుకుని టీడీపీలోనే కొనసాగవద్దని ఆపార్టీనాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఈప్రాంతంలో సాగయ్యే సుబాబుల్‌కు చంద్రబాబు హయాంలో టన్నుకు రూ.1500 అందిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.4,500 అందిస్తున్నారని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ కులం, మతం, రాజకీయపార్టీలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. ముప్పాళ్లలో గత ఎన్నికల్లో తమపార్టీకి మెజార్టీ రానప్పటికీ సంక్షేమ పథకాల అమలులో ఏ ఒక్కరికి అన్యాయం చేయలేదన్నారు. సీఎం జగనన్న పాలనలో డీబీటీ రూపంలో ఆయా పథకాల ద్వారా గ్రామస్తులకు సుమారు రూ.70కోట్లకుపైగా అందించామని గుర్తుచేశారు. రాజీ పడకుండా అభివృద్ధి చేసి చూపించామని వివంచారు. ఇప్పటికైనా మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేసి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుడేటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీ నల్లాని రమాదేవి, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, రాయల జానకిరామయ్య, నల్లాని సాయి, నల్లాని అయ్యన్న, బండారుపల్లి కపిల్, నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కీసర(కంచికచర్ల) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. సీఎం జగనన్నను ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మండలంలోని కీసరలో శుక్రవారం ఆయన 'గడప గడపకు మనప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. వారు యోగ క్షేమాలతోపాటు వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. సాంకేతిక కారణాలతో పలువురికి ఆయా పథకాలు అందలేదని చెప్పడంతో ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించి అర్హులందరికీ పథకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. కీసర ఎస్టీకాలనీలో తాగునీటి పైపులైన్, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులను వెంటనే ప్రారంభించాలని సర్పంచి నర్సమ్మ, స్థానిక నాయకులు వేల్పుల రమేష్, పరిటాల రాముకు సూచించారు. ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాపట్ల స్వామి, ఉపసర్పంచి చలమల ప్రభాకర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీఆర్వో హసీనాబేగం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేయడం వల్ల ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చునని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ సారథి చెప్పారు. ఏప్రిల్-27న జరుగనున్న పాలీసెట్-2024 ప్రవేశ పరీక్షపై పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో జరిగింది. నగరంలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు వెళ్లి పాలిటెక్నిక్ కోర్సులపై, కోర్సు పూర్తి చేసిన అనంతరం ఉన్న ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు.

సూర్య నమస్కారాలపై శిక్షణ

చందర్లపాడు(నందిగామ): రథసప్తమిని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని రామన్నపేట జెడ్పీ పాఠశాల విద్యార్థులకు సూర్య నమస్కారాలపై అవగాహన కల్పించారు.యోగా గురువు కే సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సూర్య నమస్కారాలు చేయడం నేర్పించడంతోపాటు కలిగే ప్రయోజనాలపై వారికి అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘునాధప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ ఆకుల హనుమంతరావు

నందిగామ: వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ ఆకుల హనుమంతరావు తెలిపారు. నందిగామ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ ఆకుల హనుమంతరావు అధ్యక్షతన జరిగింది. మండలాభివృద్ధిపై సభ్యులు చర్చించారు. ముఖ్యంగా వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో మంచినీటి వసతి, బోర్లకు మరమ్మతులపై సమీక్షించారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. ఈసందర్భంగా కొణతమాత్మకూరు సర్పంచి మేడా కోటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో పలుశాఖల అధికారులు అందుబాటులో ఉండటం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో జెడ్పిటిసి సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ , డిప్యూటీ తహసీల్దార్ రిబ్కా రాణి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



రూ.25లక్షలతో పెనుగంచిప్రోలులో నిర్మించిన తారురోడ్డు



రూ.3.75కోట్లతో నిర్మించిన కల్యాణమండపం

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో శనివారం ఉదయం10 గంటలకు సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపు పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి శ్రీతిరుపతమ్మవారి ఆలయం వరకు రూ.25లక్షలతో నిర్మించిన రోడ్డు, మునేరు అవతల మామిడితోటల్లో రూ.3.75కోట్లతో నిర్మించిన కల్యాణ మండపం, గదులు, రెండు మినీ ఫంక్షన్ హాళ్లు, మరో రూ.1.80కోట్లతో నిర్మించిన నాలుగు మినీ ఫంక్షన్ హాళ్లను ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను హాజరై ఆయా అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

చురుగ్గా జగనన్న ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్లు

వత్సవాయి : మండలంలో జగనన్న ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. మండలంలోని ఆయా గ్రామాల్లో 34లేఅవుట్లు వేసి 3729మంది పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేశారు. పేదల స్థలాలపై వారికి సంపూర్ణమైన హక్కులు కల్పించడం ద్వారా భవిష్యత్‌లో వారికి ఆ ఆస్తి అన్ని రకాలుగా అండగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ఇళ్లస్థలాలను రిజిస్ట్రేషన్ చేయించాలని నిర్ణయించి, ఈ మేరకు చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. మండలంలోని భీమవరం, మాచినేనిపాలెం సచివాలయాలు మినహా 17సచివాలయాల్లో ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు చేపట్టారు. గ్రామాల్లోని ప్రజలు పగలు వ్యవసాయం పనులకు వెళ్తూ సాయంత్రం వేళల్లో రిజిస్ట్రేషన్ కోసం వస్తున్నారు. లబ్ధిదారుల పరిస్థితిని అర్థంచేసుకున్న సచివాలయ ఉద్యోగులు సైతం సాయంత్రం నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. మండలంలో మంజూరైన 3729ఇళ్లలో ఇప్పటివరకు 897 ఇళ్లపట్టాలను లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసినట్లు తహశీల్దార్ ఎం.రవి కుమార్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సాగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించి, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీఎం జగనన్న ప్రభుత్వం పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్లను కూడా ఉచితంగా చేస్తుండటంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు



శ్రీపార్వతి సమేత రామలింగేశ్వర ఆలయంలో స్వామివారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రథసప్తమి పురస్కరించుకుని నగరంలోని పలు దేవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సూర్య నమస్కారాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన సూర్యభగవానుడి చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు చేశారు. స్వామివారికి పాయసం నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో రథసప్తమి సందర్భంగా సూర్య నమస్కారాలు జరిగాయి. స్వామివారికి ప్రీతిపాత్రమైన పాయసం తయారు చేసి నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు డీవీఎస్ రాజు, కార్యదర్శి డీ శివరామరాజు పర్యవేక్షించారు. అలాగే ముత్యాలంపాడులోని శ్రీ పట్టాభి రామచంద్రస్వామి దేవాలయంలో రథసప్తమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆదిత్య హృదయ పారాయణం జరిగింది. అనంతరం స్వామివారిని అందంగా అలంకరించిన రథంలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు.

రేపు అక్కినేని శత జయంతి వేడుకలు

విజయవాడ కల్చరల్: అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం సినీ నటుడు, నిర్మాత అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలను రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు చీదెళ్ల నాగేశ్వరరావు తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణాజిల్లాకు చెందిన అక్కినేని స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని పేర్కొన్నారు. ప్రపంచం గర్వించేలా స్టూడియో నిర్మాణం చేశారని తెలిపారు. అక్కినేని జీవితం గురించి నేటి తరానికి తెలియజేయడానికి పెద్ద ఎత్తున కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేష సాయి పాల్గొంటారని చెప్పారు. సినీ నటుడు, నిర్మాత మాగంటి మురళీమోహన్‌కు అక్కినేని జాతీయ స్మారక పురస్కారం ప్రదానం చేస్తున్నామని దేశ విదేశాల్లో ఉన్న అక్కినేని అభిమానులు హాజరు అవుతారని తెలిపారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ అక్కినేని నటించిన చిత్రాల్లోని పాటలను గాయనీ గాయకులు ఆలపిస్తారని వెల్లడించారు. అనంతరం అక్కినేని శత జయంతి వేడుకలు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కే డేవిడ్‌రాజు, భేతాళం వీరభద్రరావు, అరిగెల శివరాంప్రసాద్, జేకే చక్రవర్తి, గాయకుడు ప్రిన్స్ పాల్గొన్నారు.